క్లుప్తంగా

డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ బదిలీ

డోర్నకల్: డోర్నకల్ మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి మరిపెడ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. గత ఫిబ్రవరి 15న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరేష్‌రెడ్డి పాలనలో తనదైన ముద్ర వేశారు. మరిపెడ కమిషనర్ విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామి డోర్నకల్‌కు బదిలీ అయ్యారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



మరిపెడ రూరల్: ఎస్‌జీఎఫ్ అండర్–16 రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు మండలంలోని ఎల్లంపేట హైస్కూల్ విద్యార్థిని పున్నెపుర్తి సింధు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బి.భాస్కర్ రావు శనివారం తెలిపాడు. ఎంపికైన సింధును ఉపాధ్యాయుడు రాంబాబు, కోచ్ కల్లెపల్లి రమేశ్, తదితరులు అభినందించారు.

సిమెంట్ బెంచీల వితరణ



గార్ల: మండలంలోని చిన్నబంజర పంచాయతీలోని 3 గ్రామాలకు తేజావత్ హరిసింగ్ జ్ఞాపకార్థం, కాంగ్రెస్ నాయకురాలు తేజావత్ శారద 16 సిమెంట్ బెంచీలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోహన్, మంగీలాల్, లక్ష్మణ్, ధర్మ పాల్గొన్నారు.

ప్రజాసేవలో ముందుంటాం

గూడూరు: శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజాసేవలోను పోలీసులు ముందుంటామని సీఐ కె.బాబూరావు అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో శనివారం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సత్యవతి



గార్ల: సీపీఎం మండల కార్యదర్శిగా అలువాల సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గార్లలో జరిగిన పార్టీ మండల మహాసభలో ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు తెలిపారు.

బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా శివ




గూడూరు: గూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పెసరి శివను నియమిస్తున్నట్లు శనివారం అధ్యక్షుడు కత్తి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



నెల్లికుదురు: మండలంలోని రావిరాలలో వరదల కారణంగా నష్టపోయిన గ్రామ బాధితులకు తహసీల్దార్ కోడిచింతల రాజు అండగా నిలిచి ప్రభుత్వం నుంచి, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి సహాయ సహకారాలు అందించినందుకు జగతి ఫౌండేషన్, కేర్ హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. అనంతరం గ్రామంలోని వరద బాధితులకు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో కేర్ హాస్పటల్ బాధ్యుడు మహేష్, ఎస్సై చిర్ర రమేష్ బాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ శనివారం దర్శించుకున్నారు. తొలుత అర్చకుడు రామాచార్యులు ఆయనకు శాలువా కప్పి దేవాలయం లోనికి ఆహ్వానించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, ఝాన్సీలక్ష్మి, సూరపురెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

సంతాపం

మహబూబాబాద్: గుస్సాడి నృత్య కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు మృతికి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ శనివారం సంతాపం తెలిపారు. గుస్సాడి నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి కనకరాజు అన్నారు.

చిరుధాన్యాల టిఫిన్స్‌తో ఆరోగ్యం

- రాగి, ఇడ్లీ, మిల్లెట్ దోశ, వడ
- పట్టణవాసుల్లో పెరుగుతున్న ఆసక్తి

మహబూబాబాద్ అర్బన్: పెరుగుతున్న పాశ్చాత్య పోకడలతో రసాయన మిళిత భోజనాలకు అలవాటుపడిన ప్రజలకు కమ్మటి పల్లెరుచులను అందించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక హోటళ్లు వెలిశాయి. స్వచ్ఛమైన సేంద్రియ వంటకాలు, పూర్వకాలపు పద్ధతుల్లో వండిన వంటకాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ఇక్కడ వండే ప్రతి వంటకమూ ప్రత్యేకమే. మామూలుగా మార్కెట్లలో దొరికే పదార్థాలను ఇక్కడ ఉపయోగించరు. చివరకు



చిరుధాన్యాలతో చేసిన ఇడ్లీ, వడ

రుచిని కలిగించే ఉప్పుకు బదులుగా సైంధవ లవణాన్ని వాడుతుంటారు. చక్కెరకు బదులుగా టీలో తాటి బెల్లాన్ని వాడుతారు. ఆధునిక పోకడలతో అనారోగ్యాల బారిన పడుతున్న నేటి తరానికి ఏళ్లక్రితం నాటి కమ్మని గ్రామీణ ప్రాంతాల రుచులను అందిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో ఘన్‌శ్యామ్ మిల్లు విధిలో తేజసాయి హోటల్‌లో టిఫిన్స్ ప్రత్యేకంగా చిరుధాన్యాలతో రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. ఈతరం వారికి ఆనాటి కొర్రలు, సామలు, వరిగెలు, అరికెలు, మొదలగు వాటితో సంప్రదాయ శాఖహార అల్పాహారాలు అందిస్తున్నారు. అదేవిధంగా వేడివేడిగా రాగి, సజ్జ, జొన్న రొట్టెలు, రాగి సాంబర్ ఇడ్లీ, రాగి డ్రైఫ్రూట్ జావ, కొర్రజావ, మిల్లెట్, పెసర, రెడ్ దోశ, ఊతప్ప, సామ ఉప్మా, పెరుగన్నం, జొన్న, రాగి సంకటి, బ్లాక్‌టీ, జొన్న రాగి, సజ్జ హవిశ లడ్డులు స్వచ్ఛమైన గోపు ఉత్పత్తులు వంటకాలు, శాఖాహారం భోజనం మానుకోట ప్రజల కోసం అందిస్తున్నారు.

హామీలను నిలబెట్టుకోవాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు మాదిరిగానే అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా రూ.12లక్షల ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్‌మాదిగ, జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్యమాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌కు శనివారం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గాడిపెల్లి వెంకన్న, చెవిటి రాధా, కుక్కల సుధా, కందిపాటి నాగరాజు, చాగంటి రవి, రాజేందర్, రాజు, వీరన్న, ఎల్లయ్య, క్రాంతి, కన్నయ్య, భాస్కర్, బాలరాజు, సత్యబాబు, సంధ్య, మాధవి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అవినీతిపరులపై దృష్టి సారించాలి

డోర్నకల్: డోర్నకల్ తహసీల్దారు కార్యాలయంతోపాటు మున్సిపాలిటీ కార్యాలయంలో లంచాలు వసూలు చేస్తున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తహసీల్దారు కార్యాలయంలో పలు విభాగాల సిబ్బంది ప్రతీ పనికి డబ్బులు వసూలు చేస్తూ పనుల కోసం వచ్చే పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంటి నిర్మాణం, ఇంటి నంబర్లు, ఇతర పనులకు చేయి తడిపితేనే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని హరికృష్ణ కోరారు.

మోటార్ల చోరీపై కేసు నమోదు

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల చోరీపై డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్సై వంశీధర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం తొడేళ్లగూడెంకు చెందిన తేనె బ్రహ్మయ్య, ముల్కలపల్లికి చెందిన జీగర్లమూడి శ్రీనివాసరావు, చెవుల రంగయ్య, చిలుకోడుకు చెందిన సాంబశివరావుకు చెందిన వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. బాధిత రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



గూడూరు: ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

గూడూరు: మండలంలోని వెంగంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుగులోతు చక్ర (55) శనివారం మృతిచెందాడు. విషయం తెల్సుకున్న గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, దహన సంస్కారాలకు రూ.20వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్ల భవాని విష్ణు గౌడ్, పెద్దలు కుందూరు శోభన్‌రెడ్డి, బొమ్మగాని దుర్గయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ బోడ కవితాభాస్కర్ పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన నర్సింగం రాజలింగం అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం అభ్యుదయ రైతు సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు పోలెపల్లి చెన్నారెడ్డి, కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, కోశాధికారి అనిల్‌కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల హక్కుల సాధనకు కృషి

నెహ్రూసెంటర్: ఐఎన్‌టీయూసీ–327 యూనియన్ స్థాపించి 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్ ఐఎన్‌టీయూసీ–327 యూనియన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాము వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు రవిశేఖర్, నాయకులు మసూద్‌పాష, రత్నంరాజు, నరసింహాస్వామి, రాజేష్, గంగాధర్ పాల్గొన్నారు.

తొర్రూరు: విద్యుత్ కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని టీఎస్ఈఈ–327 (ఐఎన్‌టీయూసీ) డివిజన్ అధ్యక్షుడు ఎస్కే పాషా, కార్యదర్శి వీర సోములు అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి మధు, నాయకులు యాకూబ్, ధరావత్ సికిందర్, నాగరాజు పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వేతనాలు విడుదల చేయాలి

తొర్రూరు: పంచాయతీ కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని ప్రగతి శీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుండాల సోమనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిలింగంలతో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు.

అమరుల ఆశయాల కోసం పోరాడుదాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: శ్రమజీవుల రాజ్యం కోసమే తమ అమూల్యమైన ప్రాణాలను విడిచిన భారత విప్లవోద్యమ అమరవీరుల ఆశయాల సాధన కోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అమరవీరుల వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 1నుంచి 9వ తేదీ వరకు అమరుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. గ్రామగ్రామన విప్లవ లక్ష్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముల్కురు జగ్గన్న, బిల్లకంటి సూర్యం, పైండ్ల యాకయ్య, ఉమ్మగాని సత్యం, జక్కుల యాకయ్య పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పి.మధు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, వేణు, మహేష్, సురేష్, వెంకటేష్, ప్రసన్న పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బయ్యారంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ గుగులోత్ సూర్యప్రకాశ్, రాజేష్, వంశీ, అఖిల్, అరుణ్, ప్రసాద్ పాల్గొన్నారు.



మహబూబాబాద్: ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

ధనికులకు అనుకూలంగా పాలకులు



మాట్లాడుతున్న సోమయ్య

బయ్యారం: కేంద్రం, రాష్ట్రంలోని పాలకులు ధనికులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేదల కడుపు కొడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం శనివారం నిర్వహించిన పార్టీ మండల మహాసభను ఉద్దేశించి వారు మాట్లాడారు. కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుకూలశక్తులు అధికారంలో ఉండటం వలన దేశంలో మైనార్టీలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలుపర్చకుండా వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి హైడ్రా లాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభలో నాయకులు రాజన్న, ఉపేందర్, శ్రీను, సత్యవతి, మధు, వెంకన్న, చంటి, విజయ తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

చిన్నగూడూరు: వరి పంటలో సుడిదోమ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త మాలతి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించి, సుడి దోమ నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటను ఎక్కువగా అక్టోబర్, నవంబర్ నెలల్లోనే దోమలు ఆశించి నష్టపరిచే అవకాశం ఉందన్నారు. సుడిదోమ నివారణకు వరి పొలాన్ని ఆరబెట్టి నత్రజని ఎరువులను మోతాదు మేరకే వాడాలని సూచించారు. కార్యక్రమంలో మరిపెడ ఏడీఏ విజయ్ చంద్ర, చిన్నగూడూరు ఏఈఓ భాస్కర్, రైతులు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: వరి పంటసాగులో వచ్చే సుడిదోమపై రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు మాలతి, క్రాంతికుమార్ సూచించారు. శనివారం మండలంలోని గుర్తూరు గ్రామ శివారులోని వరిపంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఈఓ భాస్కర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో వరిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ ప్రవేశ పెడితే, మాజీ సీఎం కేసీఆర్ బలోపేతం చేసి వైద్యానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె రూ.25,46,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కురవి: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నల్లెల్ల గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో దువ్వ సైదులు, బత్తుల వీరన్న, హేమలత, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థుల చేత.. పుస్తకాల మోత



ప్రత్యేక అవసరాల భవనం నుంచి ఆటోలోకి పాఠ్య పుస్తకాలు మోస్తున్న విద్యార్థులు



పుస్తకాల లోడుతో పాఠశాలకు వెళ్తున్న ఆటో

మరిపెడ రూరల్: పాఠశాల విద్యార్థులను బాల కార్మికులుగా మార్చి కూలీ పనులు చేయించారు. మరిపెడ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలోకి ఇటీవల ప్రభుత్వం రెండో విడత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసింది. వాటిని ఎమ్మార్సీ పరిధి పిల్లల ప్రత్యేక అవసరాల భవనంలో నిల్వ చేశారు. ఎమ్మార్సీ సిబ్బంది ద్వారా పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు చేర్చాలి ఉంది. అందుకు ప్రభుత్వం రవాణా ఖర్చులను కూడా వెచ్చిస్తుంది. అయితే.. మరిపెడ హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులను తీసుకొచ్చి వారితో ఆటో నిండా వందలాది పుస్తకాలు లోడ్ చేయించారు.

జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఈశ్వర్

మహబూబాబాద్ అర్బన్: జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థి చేవుల ఈశ్వర్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్‌లో బెంగూళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



సంక్షిప్త సమాచారం

పాదయాత్రను విజయవంతం చేయాలి

గూడూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని సంఘం జాతీయ కార్యదర్శి యశోద భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పాదయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు చీదురు వెంకన్న, బెజ్జం రమేశ్, సింగుడాల కొమ్మాలు, సదయ్య పాల్గొన్నారు.

బాంబుల మోతను నివారించాలి

నెల్లికుదురు: మండలంలోని శ్రీ వేంకటేశ్వర స్టోన్ క్రషర్‌లో రాత్రివేళల్లో పేలుస్తున్న బాంబుల మోతతో తండాలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుగులోతు హచ్చు నాయక్ ఆరోపించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..



మరిపెడ రూరల్: మరిపెడ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళ అయిందంటే చాలు మందు బాబులు కార్యాలయ ఆవరణంలో మద్యం తాగి సేద తీరుతున్నారు. ఆవరణంలో ఏదో మూలకు నిత్యం మద్యం సీసాలు, గ్లాసులు, సిగరేట్ ముక్కలు పడేస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు మరిచారు



బయ్యారం: చిత్రంలో కనపడుతున్న రహదారి మండలంలోని కొత్తపేట నుంచి ఏజెన్సీలోని పలు పంచాయతీలకు వెళ్లే రహదారిపై అలిగేటి బ్రిడ్జి ప్రాంతంలోనిది. వర్షాకాలంలో వచ్చిన వరదలకు రహదారిపై ఉన్న బీటీ కొట్టుకపోవటంతో మట్టి రోడ్డుగా మారడంతోపాటు పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు నిర్వహించాలని వాహనదారులు కోరుతున్నారు.

వీడ్కోలు

గూడూరు: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో పనిచేస్తున్న ఎల్ఈఆర్‌పీ బి. రవి, డి.పవన్‌కుమార్ 2024 డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీలుగా సెలక్ట్ అయ్యారు. వారికి మండల విద్యాశాఖ అధికారి జె.రవికుమార్, ఎంఆర్‌సీలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు శాలువాలు కప్పి సన్మానించి, వీడ్కోలు పలికారు.

రైలునుంచి జారిపడి ఒకరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: రైలు నుంచి జారిపడి ఒకరికి గాయాలయ్యాయని జీఆర్పీ కానిస్టేబుల్ శోభన్ బాబు శనివారం తెలిపారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని నాగపూర్ ప్రాంతానికి చెందిన పారామిలిటరీ ఉద్యోగి టిల్లాస్ నాగపూర్ వెళ్లడానికి విజయవాడలో నర్సాపూర్ నుంచి నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుని ఆగి వెళ్తుండగా టిల్లాస్ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిపోయాడు. తలకు గాయలుకాగా వెంటనే 108లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

పింఛన్లు పెంచి ఇవ్వాలి

కేసముద్రం: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్‌లను పెంచి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భిక్షమయ్య, సోమక్క, ఎల్లయ్య, నీలమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.


టీకాల పంపిణీకి సహకరించాలి

డోర్నకల్: మండలంలో కొద్ది రోజులుగా జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీకి రైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు కోరారు. శనివారం పశువైద్యశాలలో ఆయన మాట్లాడారు.

ఒకే పంచాయతీరాజ్ చట్టాన్ని అమలు చేయాలి

గార్ల: దేశవ్యాప్తంగా ఒకే పంచాయతీరాజ్ చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ పరిషత్ కన్వీనర్ గార్ల వాసి ఎంఏ జలీల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలోని మయూర్ విహార్ ప్రధాన కార్యాలయంలో జరిగిన అఖిల భారత పంచాయత్ పరిషత్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొని మాట్లాడారు.

చేతి పంపునకు మరమ్మతులు చేయించాలి



మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలోని ప్రధాన రహదారిలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద చేతి పంపు రిపేరుకు వచ్చి నెల రోజులు అవుతుంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. జీపీలో నిధులు ఉన్నప్పటికీ గ్రామ ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జ్ కార్యదర్శి గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పాల్గొన్న సీఐ, ఎస్సై

బయ్యారం: పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తూ శనివారం రాత్రి బయ్యారంలో పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.